ప్రజాశక్తి
సోమవారం 17, ఏప్రిల్ 2023



ఒడిసి ఉపాధ్యాయుడికి పూలే ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండలంలోని కమ్మవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘనాయకులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గౌస్ లాజమ్‌కు జ్యోతిరావుపూలే ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. తిరుపతి పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 56మందికి మహాత్మా జ్యోతిరావు పూలే ఎక్స్ లెన్స్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. తిరుపతిలోని దుర్గా బాయి దేశ్ ముఖ్ మహిళా ప్రాంగణంలో జస్టిస్ చంద్రకుమార్, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శేఖర్, సీనియర్ జర్నలిస్టు, కవి ఇంద్రవెల్లి రమేష్ చేతులు మీదుగా గౌస్‌లాజంకు అవార్డు అందజేశారు. ఈ అవార్డు తనమీద మరింత బాధ్యత పెరిగిందని అవార్డు గ్రహీత అన్నారు.

అధిక ధరలతో బెంబేలు..!

రంజాన్ పండుగ అని సుబహాన్ తన మూడేళ్ల కూతురికి దుస్తులు కొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి హిందూపురం పట్టణం ముక్కడిపేటలో ఒక వస్త్ర దుకాణానికి వెళ్లాడు. కనీసం రూ.600 విలువ కూడా చేయని ఒక గౌను రూ.2500 అని వ్యాపారి చెప్పడంతో ఆర్థిక స్థోమత లేక వెనక్కి వచ్చాడు.

దిన కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నూరూల్లా తన 15 సంవత్సరాల కూతురు కోసం ఒక డ్రెస్ కొనడానికి షాప్‌కి వెళ్లాడు. రూ.800 విలువ కూడా చేయని డ్రస్ రూ.4 వేలు అని వ్యాపారి చెప్పడంతో అతను ఒక్కసారిగా కంగుతిన్నాడు. చివరకు రూ.3 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ వ్యాపారి ఇవ్వలేదు. ఇలా ఒక్క సుభాన్, నూరూల్లాలే కాదు ఎంతో మంది దినసరి కూలీలు, మెకానిక్‌లు, ఇతర వృత్తులు చేసుకునే వారు పడుతున్న బాధలు ఇవి.

ప్రజాశక్తి-హిందూపురం

పండుగలు ఏ సమాజిక వర్గాల వారికి వచ్చినా చాలా సందడిగా చేసుకుంటారు.

వ్యాపారులు నిర్ణయించిందే ధర
మామూళ్ల మత్తులో వాణిజ్య, తూనికలు, కొలతల శాఖ అధికారులు

ముఖ్యంగా మన ప్రాంతాల్లో హిందూ సోదరులకు ఉగాది, ముస్లిం సోదరులకు రంజాన్ పెద్ద పండుగలు. ఈ పండుగల్లో కూలి నాలి చేసుకుని జీవనం సాగించే వారు సైతం వారికి లేకున్నా తమ బిడ్డలకు అయినా నూతన వస్త్రాలు కొని ఇవ్వాలని అనుకుంటారు. అయితే వస్త్ర దుకాణాకు బట్టల కోసం వెళ్లి ధరలు అడిగితే, ఒక్క సారిగా వినియోగారులకు గుండె పోటు వచ్చినంత పని అవుతోంది. వ్యాపారులు నిర్ణయించే ధర, ఆ వస్త్రలపై తయారీదారులు నిర్ణచించిన ధర ఉండదు. వ్యాపారులు నిర్ణయించిన ధరలే ఉంటాయి. ఎవరైనా నిర్ణీత ధరలు లేవని అడిగితే 'ఇష్టం ఉంటే తీసుకోండి.. లేదా వెళ్లండి.. మేము నిర్ణయిందే ధర' అంటూ వ్యాపారులు చెబుతున్నారు. వారికి ఎదురు చెప్పలేక.. ఇంట్లో భార్యకు సర్ధిచెప్పలేక.. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వ్యాపారులు చెప్పిన ధరలకే వినియోగదారులు కొంటున్నారు. కనీసం కొన్న వాటికి వ్యాపారులు బిల్లులు సైతం ఇవ్వడం లేదు. మొత్తం అంతా జీరో వ్యాపారమే. హిందూపురం పట్టణంలోని ఒక్క ముక్కడిపేటలోనే రంజాన్ నెలలో రూ.కోటికి పైగా వ్యాపారాలు జరుగుతున్నాయి. ఇక మొత్తం పట్టణంలో ఉన్న వస్త్ర దుకాణాల్లో పరిశీలన చేస్తే ఇది రూ.2 కోట్లకు పైగా జరుగుతుంది. ప్రతి దుకాణదారుడు రోజుకు రూ.లక్షకు పైగా వ్యాపారాలు చేస్తున్నారు. వారికి బిల్లు బుక్‌లు సైతం ఉండవు. ఇంత పెద్ద ఎత్తున జీరో వ్యాపారాలు జరుగుతున్నా కూత వేటు దూరంలో ఉన్న వాణిజ్య శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.



హిందూపురం పట్టణంలోని ముక్కడిపేటలో వెలసిన వస్త్ర దుకాణాలు

ఆ రెండు శాఖలే కీలకం..

వస్త్ర దుకాణాలతో పాటు ప్రతి వ్యాపారానికి ప్రధానంగా తూనికలు కొలతల శాఖ, వాణిజ్య శాఖ అధికారులే కీలకం. ఇందులో తూనికలు కొలతల శాఖ అధికారులు వస్త్ర దుకాణాలతో పాటు ఇతర దుకానాలను తనఖీ చేయాలి. నిర్ణీత ధరలకు విక్రయిస్తున్నా రా.. అధిక ధరలకు విక్రయిస్తున్నారా.. అని చూసి, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఇటువంటి కేసులు అధికారులు నమోదు చేయడం లేదు. కేవలం దీపావళి పండుగ సమయంలో మాత్రం ఎంజిఎం మైదానంలో తూనికలు కొలతల శాఖ అధికారి కనిపించి, రెండు నుంచి మూడు దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. కేసులు నమోదు చేసి వారిచ్చే మామూళ్లు తీసుకుని పోతారు. ఇక వారు కనిపించేది మళ్లీ దీపావళి పండుగకే. ఈ శాఖ ఇలా ఉంటే వాణిజ్య శాఖ అధికారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లులు తీసుకోవాలని వినియోగదారులకు మాత్రమే చెబుతారు. బిల్లులు ఇవ్వని దుకాణాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోరు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే జిఎస్‌టి ఉంది.. వ్యాపారులు కొనుగోలు సమయంలోనే పన్ను చెల్లిస్తారు..అని అంటున్నారు. అయితే జిఎస్‌టితో ఎంత కొనుగోలు చేశారు.. జిఎస్‌టి లేకుండా ఎంత కొనుగోలు చేశారు.. అన్నది మాత్రం చూడడం లేదు. ఈ రెండు శాఖల నిర్లక్ష్యానికి వినియోగదారులు అధిక ధరలతో బెంబేలెత్తున్నారు. ఇప్పటికైనా ఈ శాఖలు మామూళ్ల మత్తులో నుంచి బయటకు వచ్చి తనిఖీలు ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

చైతన్య పరిచే సాహిత్యం అవసరం

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'సాహిత్యమైన మనిషిని చైతన్యపరచి ముందుకు నడిపించాలని, నిన్నటి కంటే నేడు.. నేటి కంటే రేపు సమాజం, మనిషి ఉన్నతంగా అభివృద్ధి చెందేటట్లు సాహిత్యం ప్రధాన భూమిక పోషించాలని, మన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి జీవితాన్ని చైతన్య పరచుకోవడానికి సాహిత్యం ఎంతో అవసరం ' అని వక్తలు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ నిర్వహణలో నందవరం కేశవరెడ్డి రచించిన కాంతి పూలు ఆవిష్కరణ సభ స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు అరసం అనంతరం జిల్లా శాఖ అధ్యక్షులు బి.ఈశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేశవరెడ్డి నిరంతరం సాహితీ కృషి చేస్తున్నారని కొనియాడారు ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ప్రసంగిస్తూ.. కాంతిపూలు పుస్తకం చదివితే మనిషి నైతికంగా ఎలా జీవించాలో తెలుస్తుందని అన్నారు. ఈ పుస్తకం నిండా మనిషి సంపూర్ణంగా జీవించడం ఎలాగో తెలియజేసే విషయాలు ఉన్నాయన్నారు. విశిష్ట అతిథులు డాక్టర్ శాంతి నారాయణ, బండి నారాయణస్వామి ప్రసంగిస్తూ.. జీవితం మనిషిని ఉన్నత మానవుడిగా తీర్చిదిద్దడమే కాక మొత్తం మానవజాతి చైతన్యాన్ని ఉన్నతీకరించగల శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటుందన్నారు. అదే జీవితం ఇలాంటి జీవిత రహస్యాలను ఈ కావ్యం తెలియజేస్తుందని కొనియాడారు. కాంతిపూలు పుస్తకాన్ని సమీక్ష చేసిన తూముచెర్ల రాజారాం ప్రసంగిస్తూ ఈ కావ్యంలో 29 వ్యాసాలు ఉన్నాయన్నారు. ప్రతి వ్యాసం దేనికదే ప్రత్యేకతతో పాఠకుల్ని చదివించే లక్షణం కలిగివుందన్నారు. తరిమెల అమరనాథ్‌రెడ్డి, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి తదితరులు మాట్లాడుతూ.. అరసం అన్నవరం జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు కాంతి పూలు రచయిత నందవరం కేశవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధేయ, అరసం అనంతరం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర, ఆకుపచ్చ వెంకటేశులు, ఏలూరు యంగన్న, చంద్రశేఖర శాస్త్రి, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ మేనేజర్ ఎ. ఓబుళపతి, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, పూజారి ఈరన్న, కొత్తపల్లి సురేష్, మధుర శ్రీ, డాక్టర్ జన్నే ఆనంద్ కుమార్, చెట్ల ఈరన్న, నరసిరెడ్డి, వన్నప్ప, డాక్టర్ జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, ఆదిఆంధ్ర తిప్పేస్వామి, ఆర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పూర్వ వైభవం తేవడమే లక్ష్యం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్నో సంవత్సరాల తరబడి భద్రపరచిన విజ్ఞాన సమాచారం, విజ్ఞాన సంపదను పాఠకులకు అందిస్తూ గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థల ఛైర్మన్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల్లోని గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, పాఠకులకు అనువైన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చి సేవలు పదిలం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధిపై ఆదివారం ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

విలేజ్ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటులో రాష్ట్రం ఆదర్శం
జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి



ప్రశ్న : గ్రంథాలయాల సేవల నిర్వహణ ఎలా ఉంది ?

జవాబు : అనంతపురం, శ్రీసత్యసాయి ఉమ్మడి జిల్లాల్లో డిజిటల్ లైబ్రరీతో పాటు 70 గ్రంథాలయాలు ఉన్నాయి. 10 గ్రామీణ గ్రంథాలయాలు, 70 బుక్ డిపాజిట్ సెంటర్‌లు ఉన్నాయి. తాను బాధ్యతలు చేపట్టిన తరువాత రూ.40 లక్షలతో పుస్తకాలు కొనుగోలు చేశాం. రూ.16 లక్షల విలువ గల కంప్యూటర్లు కొనుగోలు చేసి అందుబాటులోకి తెచ్చాం. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అనుగుణంగా పుస్తకాలు అందుబాటులో ఉంచాం. పాఠకులు పెరిగేలా మెరుగైన సౌకర్యాలు కల్పించాం.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా? నూతన ఉద్యోగాలు కల్పించారా?

జవాబు : సిబ్బంది కొరత కొంత ఉంది. తాను బాధ్యతలు చేపట్టిన తరువాత 13 పోస్టులు భర్తీ చేశాం. ఎప్పటి నుంచో కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ ప్రభుత్వంలో అభ్యర్థులకు పోస్టులు ఇచ్చాం. కారుణ్య నియామకాల కింద 2 పోస్టులు భర్తీ చేశాం. సిబ్బంది సమిష్టిగా పని చేస్తూ పాఠకులకు సేవలు అందిస్తున్నారు

ప్రశ్న : అభివృద్ధి పనులు చేపట్టారా ?

జవాబు : జిల్లాలో మూడు గ్రంథాలయాలకు సొంత భవనాలు నిర్మాణం జరుగుతోంది. నార్పలలో రూ.40 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నాం. అనంతపుం ఎంపీ తలారి రంగయ్య ఎంపీ నిధులు రూ.30 లక్షలు, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో భవనాల నిర్మాణం జరుగుతోంది. కనగానిపల్లిలో రూ.40 లక్షలతో గ్రంథాలయ భవనం నిర్మిస్తున్నాం. బ్రహ్మసముద్రంలో రూ.30 లక్షలతో భవనం నిర్మించేలా స్థల సేకరణ కూడా చేశాం. 5 గ్రంథాలయాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రతిపాదనలు కూడా ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లాం. తర్వలో ఆ పనులు కూడా ప్రారంభం అవుతాయి.

ప్రశ్న : సెస్ బకాయిలు వసూలు జరుగుతోందా?

జవాబు : ఉమ్మడి జిల్లాలో రూ.16 కోట్లు సెస్సు బకాయిలు రావాల్సి ఉంది. కొంత మేరకు వసూలు అవుతోంది. వచ్చిన సెస్సు మొత్తంలోనే ఉద్యోగులకు జీత భత్యాలు చేస్తున్నాం. ప్రభుత్వ శాఖలకు రావాల్సిన సెస్సు బకాయిలను కోర్టుకు వెళ్లి మరీ వసూలు చేసుకుంటున్నారు. గ్రంథాలయాలకు రావాల్సిన సెస్సుల చెల్లింపులో మాత్రం కొన్ని శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి శాఖల అధికారులకు జరుగుతున్న జాప్యంపై లెటర్లు పంపివున్నాం. త్వరలో చెల్లింపులు చేస్తామని అంటున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సెస్ చెల్లింపులు చేస్తే బాగుంటుంది.

ప్రశ్న : విలేజ్ డిజిటల్ లైబ్రరీలు మీ పరిధిలో ఉంటాయా ?

జవాబు : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గ్రామ, వార్డు సచివాలయానికి ఒక విలేజ్ డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తోంది. వాటి నిర్వహణ బాధ్యతలు జిల్లా గ్రంథాలయాలకే అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విలేజ్ గ్రంథాలయాల బాధ్యత, భద్రత జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉంటుంది. విలేజ్ లైబ్రరీలు అందుబాటులోకి వస్తే గ్రంథాలయాలకు పూర్వ వైభవం రావడం ఖాయం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రంథాలయాలకు ప్రాధాన్యత ఇచ్చారు. దేశంలోనే విలేజ్ లైబ్రరీలు ఆదర్శంగా నిలువబోతున్నాయి. సమాజంలో రైతులు, విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని పెంపొందించి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. అందులో తమవంతు కృషి అందించడం ఎంతో సంతోషంగా ఉంది. పాఠకుల ప్రశంసలు పొందడం అదృష్టంగా భావిస్తున్నాను.





నూతన కమిటీ సభ్యులు

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమిస్తేనే విజయం వరిస్తుందని జిల్లా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వరయ్య అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరయ్య, మల్లయ్య మాట్లాడుతు ఎన్నికల సమయంలో జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయడంతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న వారందరిని పర్మినెంట్ చేస్తామన్నారని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేయలేదన్నారు. సిపిఎస్ వల్ల ఎంతో మంది వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు రిటైర్డ్ అయిన తరువా ఎటువంటి బెనిఫిట్స్ లేకుండా విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసి అందరిని ఐక్యం చేస్తున్నామన్నారు. అనంతరం ఏకగ్రీవంగా నూతన జిల్లా కమిటీని ఎంపిక చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులుగా నామాల ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం వెంకటరమణ, ట్రెజరర్ పి విజయ భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ ఎస్ నరసింహులు, సంతోష్ కుమార్, చెన్నకేశవ రెడ్డి, వై వాసుదేవ రెడ్డి, గారు శ్రీధర్, జాయింట్ సెక్రెటరీలుగా వన్నూరు, వెంకటనారాయణ, చెన్నా రెడ్డి, గంగి రెడ్డి, సనావుల్లా, కమిటీ సభ్యులుగా ఆర్ రవి, రమణ నాయక్, అఫ్జల్ అహ్మద్, రవి, నాగరాజులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పి. నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మూర్ఛవ్యాధి శిబిరం

ప్రజాశక్తి - హిందూపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి నెల మూర్ఛవ్యాధిగ్రస్తులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులోని ఆల్‌హిలాల్ పాఠశాల ఆవరణంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఇటి రామ్మూర్తి 151 మంది మూర్ఛ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారందరికి రెండు నెలలకు సరిపడు మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు జెవివి నాయకులు జిఆర్ శ్రీనివాసులు, రామకృష్ణ, అతవుల్లా, నాగేంద్రాచారి, లక్ష్మిపతి, నాగరాజ గుప్త, ఉగ్రప్ప, సుబ్రమణ్య నాయక్, మంజునాథాచారి, చంద్రశేఖర్‌రెడ్డి, అబ్దుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.



.వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు ఇటి రామ్మూర్తి, తదితరులు

బిజెపిని సాగనంపుదాం... దేశాన్ని కాపాడుకుందాం



ప్రచారభేరి ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

కేంద్రంలోని బిజెపిని ఇంటికి సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని వామపక్ష నాయకులు అన్నారు. ఈ మేరకు వారు ఆదివారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుండి పోలీస్ స్టేషన్ వరకు పాదయాత్ర ప్రచారభేరి ర్యాలీ నిర్వహించారు, బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక దేశ ప్రజలను ధరల రూపంలో నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. స్విస్ బ్యాంక్‌లో ఉన్న నల్లదనాన్ని వెనక్కి తెచ్చి ప్రజలందరికీ పంచుతామనిచెప్పి అధికారంలోకి వచ్చి నల్లధనాన్ని వెనక్కి తియలేకపోయారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. విభజన హామీలు, ప్రత్యేకహోదా, రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీలు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పోలవరం ఎత్తు తగ్గించారని అప్పర్ భద్ర ప్రాజెక్ట్ వలన రాయలసీమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ లావాదేవీలు వాడమని చెప్పి నేడు దాని మీద కూడా పన్నులు వేస్తూ ప్రజలనూ లూటీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంస్థలను గుజరాతీలకు ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక పాలన గురించి ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ ప్రచార బేరీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పెద్దన్న, సాంబశివ, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నారాయణస్వామి, రామచంద్ర, మండల కార్యదర్శి చలపతి నాయుడు, పుట్టపర్తి మహిళా నాయకురాలు రత్నాబాయ్ తదితరులు పాల్గొన్నారు

పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణను వ్యతిరేకించండి

ప్రజాశక్తి - పెనుకొండ

పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం అయన మాట్లాడుతూ ఈనెల 17న కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వ్యవసాయ పరపతి సహకార సంఘాలలో 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలకు, ఫండ్స్‌కు కట్టబెడుతూ వైసిపి ప్రభుత్వం 1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టానికి సవరణలు చేసిందన్నారు. రైతు భరోసా కేంద్రాలను సహకార సంఘాలలో విలీనం చేస్తూ 1964 చట్టంలో 115(ఇ) అధ్యాయాన్ని చేర్చిందని ఈ సవరణలను అసెంబ్లీ, కౌన్సిల్లో పాస్ చేసిందని అన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని కోరుతూ 17న కలెక్టర్ కార్యాలయాలు ముందు జరిగే ధర్నాలలో పిఎసిఎస్ ఉద్యోగులంతా పాల్గొనాలని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

హిందూపురం : గృహాల్లో వాడే ఎల్‌పిజి గ్యాస్‌పై ప్రతి మహిళలు అవగాహన కలిగివుండాలని అగ్నిమాపక శాఖాధికారి ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్‌టిసి కాలనీ, త్యాగరాజ్ నగర్‌లో మహిళలకు వంటింట్లో జరిగే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు, విపత్తులు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను మేళాపురం ముద్దిరెడ్డిపల్లి ప్రాంతాలలో ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



నీటి గుంతలో కేరింతలు కొడుతున్న చిన్నారులు

ఎండ వేడిమికి ఉపశమనం

రొద్దం : సూర్యుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. దీంతో చిన్న పెద్ద తేడా లేకుండా ఈ వేడికి తట్టుకోలేకుండా పోతున్నారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు, నదుల్లో నీరు పుష్కలంగా ఉంది. మండలంలోని నారనాగేపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెన్నా నదిలో దాదాపు 5 అడుగుల గుంత ఉండటంతో అక్కడ నీరు ఊరుతున్నాయి. దీంతో ఆ గ్రామంలోని విద్యార్థులు, చిన్న పిల్లలు పెన్నానది నీటిలో సేదతీరుతున్నారు.

వైసిపితోనే అభివృద్ధి

నల్లచెరువు : మండల కేంద్రంలోని విజయలక్ష్మి కాలనీలో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచి పంచరత్నమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలు ప్రస్తుత ప్రభుత్వంలో అమలవుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. రెండు ప్రభుత్వాల మధ్య గల తేడాల గురించి అందరిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గృహసారధులు కుల్లాయప్ప, చంద్రకళ, వాలెంటీర్ సాయి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కదిరి అర్బన్ : పట్టణంలోని అడపాల వీధిలోని కోదండ రామస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందినిబాయి మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తే ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లలేని ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి ఉచితంగా వైద్యం చేయడానికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, కోదండ రామస్వామి దేవాలయం అర్చకులు సురేంద్రబాబు, సభ్యులు గోపాల్, ఏనుగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలలోని వన్నంపల్లి ప్రైమరీ పాఠశాలలో ముబారక్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా , శ్రీనివాస స్కిన్ డెంటల్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించడమే కాకుండా అందుకు తగిన మందులను అందజేశారు . సుమారు 170 మంది పలు వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయించుకున్నారు. వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న ఈ పరీక్షలను ఉచితంగా అందించడం ఎంతో ఉపయోగపడిందని సర్పంచి మంజునాథరెడ్డి తో పాటు గ్రామస్తులు అన్నారు. స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పరిగి సర్పంచి భర్త శివ శంకర్, కన్వీనర్ నరసింహమూర్తి పరీక్షలు చేయించుకున్నారు. గుండె సంబంధిత వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఇమ్రాన్ ఖాన్, షాహిద్ ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

సండే పాఠశాలకి సగమే హాజరు

ప్రజాశక్తి - చిలమత్తూరు

పది పరీక్షల నేపథ్యంలో పది పరీక్ష కేంద్రం గా ఉన్న స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుండి 9 వరకు చదివే విద్యార్థులకు పరీక్షల రోజు సెలవు ఇవ్వటంతో విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు ఆదివారాలు సైతం పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఈ ఆదివారం కూడా పాఠశాలను నిర్వహించారు. అయితే విద్యార్థులు హాజరు సగం కన్న తక్కువ రావడంతో ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధించాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. విద్యాశాఖ చెప్పింది కాబట్టి ఉపాధ్యాయులు హాజరవుతున్నారు. కాని విద్యార్థులు మాత్రం నామమాత్రంగానే హాజరవుతున్నారు. స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది మినహాయించి 650 మంది విద్యార్థులు ఉండగా అందులో 290 మంది విద్యార్థులు మాత్రమే ఆదివారం హాజరయ్యారు. ఆదివారం సెలవుకు అలవాటు పడిన విద్యార్థులు పాఠశాలకు సగానికిపైగా డుమ్మా కొట్టారు.

బంజారా సంఘం డివిజన్ కమిటీ ఏర్పాటు

కదిరి టౌన్ : కదిరి డివిజన్ బంజారా సంక్షేమ సేవా సంఘం నూతన డివిజన్ కమిటీ అధ్యక్షులుగా భూక్యకృష్ణ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కదిరి పట్టణంలో ఆ సంఘం నాయకులు సమావేశమై కదిరి డివిజన్, మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీ ఆనంద నాయక్ ఎన్నికయ్యారు. డివిజన్ కమిటీ అధ్యక్షులుగా భూక్యా క్రిష్ణనాయక్,ఉపాధ్యక్షులుగా శ్రీరాములునాయక్, రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శిగా చలపతి నాయక్, సహాయకార్యదర్శులుగా రమణనాయక్, నాగేంద్ర నాయక్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఆమడగూరు : మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. చీకిరేవులపల్లి పంచాయతీలోని రెడ్డివారి పల్లి సిమెంట్ రోడ్డును, మహమ్మదాబాద్ పంచాయితీ లోని పత్రవాండ్లపల్లి సంగీతంపల్లి తిమ్మరకుంటపల్లి సిమెంట్ రోడ్డును, జోకుల కొత్తపల్లి పంచాయతీలోని తనకంటి పల్లి రోడ్డును ప్రారంభించారు. అలాగే జెకె పల్లి పంచాయతీలోని ఇదే వాండ్లపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ఆ గ్రామంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ శేషరెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణ, జెడ్పీటీసీ శివశంకర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

నిత్యావసర సరుకులు పంపిణీ

గోరంట్ల : పట్టణంలో హిందూపూర్ రోడ్ లో గల ఎమ్మెస్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం 250 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రంజాన్ మాసం సందర్భంగా నిరుపేదలకు సరుకులు పంపిణీ చేశారు. పేదలకు సరుకులు పంపిణీ చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు

చలివేంద్రం ప్రారంభం

పెనుకొండ : సత్య సాయి సేవా సమితి వారు పట్టణంలోని శ్రీకష్ణదేవరాయలు సర్కిల్ వద్ద చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. శ్రీ సత్య సాయి సేవ కోఆర్డినేటర్ సీతారాం, ఎజిపిఎం భాస్కర్ రెడ్డి ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్య సాయి ఐటీ కోఆర్డినేటర్ శ్రీరాములు, పెనుకొండ సమితి కన్వీనర్ బి.శంకర, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

పెనుకొండ : రంజాన్ మాసంను పురస్కరించుకొని మండలంలోని గుట్టూరు జామియా మసీదులో 150 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫాను స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ పంపిణీ చేశారు. స్థానిక జెడ్పిటిసి శ్రీరాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ గీతారామ్మోహన్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వచ్చే ఎన్నికల్లో టిడిపికి పూర్వవైభవం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల

ప్రజాశక్తి - మడకశిర

వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తీసుకువస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఆదివారం బాలాజీ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు గుండుమల తిప్పేస్వామికి పూలమాలలు వేసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తనపై నమ్మక ముంచి నియోజక వర్గం కోఆర్డినేటర్ గా నియమించిన నేపథ్యంలో తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో నియోజక వర్గంలో పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థి విజయానికి అందరిని కలుపుకుని కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మనోహర్, సత్య సాయి జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్, కార్యదర్శి పుల్లయ్య చౌదరి, కౌన్సిలర్లు ఉమాశంకర్, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, మాజీ కో ఆప్షన్ మెంబర్ సన్నీరప్ప, మాజీ డీలర్లు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

అనంత మార్కెట్‌లోకి యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్టులు

ఆథరైజ్డ్ డీలర్ జావిద్ అహ్మద్

ప్రజాశక్తి-అనంతపురం

భవన నిర్మాణ రంగంలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు యునోటెక్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకొచ్చిందని సంస్థ అనంతపురం డీలరు, జావిద్ టైం వరల్డ్ అధినేత జావిద్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ యునోటేక్ బిల్డింగ్ ప్రొడక్ట్స్‌లో ఎసి బ్లాక్ జాయింట్ మోర్టర్ లైట్ వెయిట్, ఎకో ఫ్రెండ్లీ ఫాస్ట్ కన్స్ట్రక్షన్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నమ్మకం నాణ్యతతోపాటు తరతరాలు నిలిచే విధంగా నిర్మాణ రంగంలో యునోటేక్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. తమ ఉత్పత్తులు అత్యధిక కాలం మన్నికతోపాటు తక్కువ ఖర్చు, నీటి ఆదా ఉంటుందన్నారు. రాయలసీమ జిల్లాల్లో వేగవంతంగా విస్తరిస్తున్న యునోటేక్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ ప్రస్తుతం అనంతపురంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. యునోటేక్ ఎఎసి బ్లాక్స్ సాధారణం కన్నా 70 శాతం తక్కువ బరువు ఉంటాయన్నారు. అందువల్ల బీములు, ఫిల్లర్లకు కావాల్సిన కాంక్రీటు, స్టీలు 20 శాతం వరకూ ఆదా అవుతుందన్నారు. అంతేగాకుండా బ్లాక్స్ ఒకేసైజులో ఉండటం వల్ల గోడ నిర్మాణం, ప్లాస్టరింగ్ సమయంలో 70 శాతం వరకు ఆదా అవుతుందన్నారు. ఇసుక, సిమెంటు భారీగా తగ్గుతుందన్నారు. ముఖ్యంగా చదల వంటి వాటి నుంచి తమ ఉత్పత్తులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అడ్డుకుంటాయని తెలిపారు. సాధారణ ఇంటి నిర్మాణంతో పోలిస్తే తమ సంస్థ ఉత్పత్తుల వాడటం వల్ల 33 శాతం నిర్మాణ ఖర్చు తగ్గుతుందన్నారు. ఉభయ జిల్లాల్లో యునోటేక్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ కావాలంటే సెల్.. 98498 36063 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



యునోటేక్ బిల్డింగ్ ప్రాడక్టు బ్రిక్స్‌తో కట్టిన నిర్మాణం, (ఇన్‌సెట్‌లో) ఆర్ట్‌రైజ్డ్ డీలర్ జావీద్ అహమ్మద్

దాతకు సన్మానం

కదిరి టౌన్ : కదిరి బస్టాండ్‌లో లక్ష రూపాయల విలువగల వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన నల్లచెరువు వాసి బెంగళూరు రియల్ ఎస్టేట్ వ్యాపారి పాల్యం సుధాకర్‌ను ఆర్టీసీ మేనేజర్ మైనుద్దీన్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పాల్యం సుధాకర్ సేవా దృక్పథంతో కదిరి డిపో పరిధి లోని వికలాంగులకు రాయితీ బస్సు పాసులకు ఆర్థిక సాయం అందించారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కదిరి డిపో పరిధిలోని అన్నీ మండలాల నుండి చదువుకునేందుకు వచ్చే విద్యార్థులకు బస్సుపాస్‌లకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని ఉచిత బస్సు పాసుల ఖర్చును తానే భరిస్తానని పాల్యం సుధాకర్ హామీ ఇచ్చారు. తాను పుట్టిన నల్లచెరువు మండలం లోని ప్రజలకే కాకుండా కదిరి నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాలనేదే తన ఉద్దేశ్యమన్నారు. నల్లచెరువులో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం, వికలాంగుల భవనం, దళితవాడ వాసులకు శ్మశానానికి భూమి కొనుగోలు అయ్యే ఖర్చు, పీర్ల చావిడి నిర్మాణం కొరకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు బాహుద్దీన్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు లోకేశ్వర రెడ్డి, పట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు పుల్లయ్య, రవి, ఎన్ఎం యుఎ నాయకులు హరిమోహన్, బైరిశెట్టి, ఉత్తన్న, నాగసుబ్బయ్య, అసిస్టెంట్ మేనేజర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటి కొళాయి కనెక్షన్లు క్రమబద్ధీకరించుకోండి

పెనుకొండ : నగర పంచాయతీ పరిధిలో ఉన్న ఇంటికొళాయిల కనెక్షన్లను ఆన్‌లైన్ చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ తెలిపారు. కొళాయి కనెక్షన్లను ఇంటి పన్నుకు అనుసంధానం చేశామన్నారు. చాలా మంది ఇంటి యజమానుల సమాచారం అందుబాటులో లేని కారణంగా వారి యొక్క ఇంటి కొళాయి కనెక్షన్ వారి యొక్క ఇంటి పన్ను రసీదులకు అనుసంధానం చేయలేదని తెలిపారు.ప్రస్తుతం పట్టణంలో వార్డు వాలెంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే జరుగుతోందనిఈ సంవత్సరానికి సంబంధించి పెనుకొండ నగర పంచాయతీకి చెల్లించవలసిన ఇంటి పన్ను, కొళాయి పన్ను డిమాండ్ నోటీసులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇంటి కొళాయిను ఇంటి పన్నుతో అనుసంధానం చేసుకోవాలని కోరారు.

అన్నదానానికి విరాళం

కదిరి టౌన్ : పట్టణంలోని ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అన్నదానానికి పట్టణానికి చెందిన మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ లక్ష్మీ దేవమ్మ కుమారుడు శ్యాం ప్రసాద్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన రూ.41,116లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము భాస్కర్, వెంకటేష్, నచ్చు బాలకష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'వివేకా' హత్య కేసులో మొదలైన అరెస్టుల పర్వం : టిడిపి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పెనుకొండ

వై ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అరెస్టుల పరంపర మొదలైందని ఇది తాడేపల్లి వరకూ కొనసాగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ వ్యాఖ్యానించార. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సవితమ్మ మాట్లాడారు. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి తండ్రి వై ఎస్ భాస్కర్ రెడ్డిని సీబీఐ అరెస్టు చేసిందన్నారు. ఇక అరెస్ట్‌ల పరంపర మొదలైందని ఇది తాడేపల్లి వరకూ కొనసాగుతుందని దోషులెవరూ తప్పించుకోలేరని అన్నారు. నిందితులకు శిక్ష పడాలని వివేకా కుటుంబానికి న్యాయం జరగాలని అన్నారు. వివేకా హత్యకేసులో భాస్కర్ రెడ్డి అరెస్టుతో నిజాలు బయటకి వచ్చాయన్నారు. జగన్ కుటుంబసభ్యులే వివేకాను పొట్టన పెట్టుకున్నారని బయటపడుతోందని వ్యాఖ్యానించారు. గుండెపోటుగా మార్చిన విజయసాయి రెడ్డి ఇప్పుడేం చెబుతారని ప్రశ్నించారు. చిట్టచివరి నిందితుడిని కూడా చట్టం ముందు నిలబెట్టాలన్నారు. ఈ సమావేశంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు, అడదాకుల పల్లి మాజీ సర్పంచి ప్రసాద్, మాజీ ఎంపీపీ నరసింహులు, మంగాపురం నారాయణ, మావుటూరు గోపాల్, త్రివేంద్ర నాయుడు, బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐడిడిపి నాయకుడిపై దాడి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన పూలనరేశ్ అనే ఐటీడీపీ నాయకుడిడపై దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు... ఇటీవల స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో జరిగిన ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను నరేశ్ సోషియల్ మీడియాలో పోస్టుచేశారు. ఇంకేముంది ఆ పోస్టును చూసిన క్షణాల్లో వైసీపీ గుండాలు శివనగర్‌లో తిక్కస్వామి గుడి సమీపంలో క్రికెట్ ఆడుతున్న నరేశ్ వద్దకు చక్రి, శ్రీనివాసులతో పాటు మరికొందరు ద్విచక్రవాహనాల్లో వచ్చి దాడికి పాల్పడ్డారు. తమ ఎమ్మెల్యేపై వ్యతిరేకంగా పోస్టులు పెడతావా అంటూ వారి వెంట తెచ్చుకున్న రాడ్లతో, కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి వెళ్లిపోయారు. స్థానికులు గాయపడిన నరేష్‌ను ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ధర్మవరం ఆస్పత్రికి వద్దకు చేరుకుని జరిగిన సంఘటనపై ఆరాతీశారు. బాధితుడు నరేశ్ ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



చికిత్స పొందుతున్న నరేష్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బత్తలపల్లి : మండలంలోని యర్రాయపల్లి సమీపంలోని హెచ్ఎల్ఎసీ కాలువ వద్ద ఆదివారం గుర్తు తెలియని యువకుని గృతదేహాన్ని గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ శ్రీహర్ష తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఎక్కడో హత్య చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ఒక ఆటోలో మృతదేహాన్ని తీసుకువచ్చి పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాలలోపు ఉంటుందన్నారు. మృతుని జేబులను తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గోరంట్ల : మండలంలోని పులేరు పంచాయతీ గ్రామ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గౌనివారిపల్లి చెందిన మృత్యుంజయ రెడ్డి, బూదిలి వాండ్లపల్లికి చెందిన వెంకట రంగారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరు పూలేరు నుంచి గోరంట్ల వైపు వస్తున్న నేపథ్యంలో ఆంజనేయస్వామి గుడి వద్ద తమ ద్విచక్ర వాహనం బోల్తాపడడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులకు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు నిర్వహించారు.

కర్నాటక మద్యం తరలింపుదారుడు అరెస్టు

మడకశిర : కర్నాటక మద్యాన్ని తరలిస్తున్న ఇరువురిని అదుపులో తీసుకున్నట్లు ఎన్ఫోర్స్‌మెంట్ సెబ్ సిఐ బార్గవ రెడ్డి తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మీపురం వాసి సాయి ప్రతాప్ రెడ్డి, వెంగళంపల్లి గ్రామానికి చెందిన కమ్మర శేఖర్‌లు తుంకూరు జిల్లా కేంద్రం నుండి కారులో 3360 టెట్రా ప్యాకెట్లను కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుల నుంచ సెల్‌ఫోన్లు, మద్యం, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది సాల్మాన్‌రాజు, జనార్ధన్, గీత, రవీంద్ర, ఆదిల్‌బాషా పాల్గొన్నట్లు చెప్పారు.

పాఠశాల సామగ్రి ధ్వంసం

చిలమత్తూరు : ఆకతాయిల ఆగడాలు రోజు రోజుకి శతి మించుతున్నాయి. చిలమత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎవరూ లేని సమయంలో పాఠశాల పర్నీచర్‌ను ధ్వంసం చేస్తూ హచ్‌చల్ చేస్తున్నారు. గతంలో ఆకతాయిల ఆగడాలను కట్టడి చేయడానికి అప్పటి రూరల్ సిఐ హమీద్ ఖాన్, అప్పటి ఎస్ఐ రంగడు పాఠశాలలో సిసి కెమరాలు అమర్చారు. అయితే ఈ కొద్దిరోజుల కాలంలోనే సిసి కెమెరాలను సైతం ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. తాజాగా పాఠశాలలో నూతనంగా నాబార్డు నిధులతో నిర్మించిన గదులలోని ప్యాన్లు, తలుపులు విరగొట్టి కొన్నింటిని దొంగలించారు. అలాగే శనివారం రోజు నీటి బోరుకు ఏర్పాటు చేసిన కేబుల్ సైతం దొంగలించారు. దీంతో మధ్యాహ్న భోజన సమయంలో తాగు నీరు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. అయితే ఈ విషయంపై పోలీసులకు విన్నివించినా ఫలితం లేనట్టు తెలుస్తుంది. ఇప్పటికైన పోలీస్ వారు ప్రత్యేక నిఘా ఉంచి పాఠశాల సంపదను కాపాడాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఇఫ్తార్ విందు

కదిరి అర్బన్ : రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసాలు ఉన్న మైనార్టీ సోదరులకు వైసీపీ నాయకులు, వాల్మీకి పాఠశాల అధినేత, అభిజ్ఞా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పవన్ కుమార్ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాల్ లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్ మౌలానా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును పవన్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ఇఫ్తార్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు కార్యకర్తలు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.


కదిరి టౌన్ : రంజాన్ మాసం పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు కదిరి పట్టణంలోని వలిసాబ్ రోడ్ లో తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే అత్తర్‌చాంద్‌బాషా ఇఫ్తార్ విందు ఇచ్చారు. అంతకుముందు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

బత్తలపల్లి : క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ అని ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన బత్తలపల్లి లోని జామియా మసీదులో రంజాన్ మాసం సందర్భంగా బత్తలపల్లి మండలంలోని ముస్లింలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తారు విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరిటాల శ్రీరామ్ తో పాటు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్,టిడిపి కుమ్మర, శాలివాహన సాధికార రాష్ట్ర కన్వీనర్ మదనాపు పోతలయ్య, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, ధర్మవరం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాస నాయుడు స్వయం గా భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మాజీ ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, మండల క్లస్టర్ సురేంద్రనాయుడు, నెట్టెం రమణ, జక్కంపూడి నాగభూషణం, జొన్నలగడ్డ రంగానాయుడు, చల్లాకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ఇచ్చే పార్టీ వెనకే కురుబలు

ప్రజాశక్తి బత్తలపల్లి

శ్రీసత్యసాయి జిల్లాలో 8లక్షల మంది కురుబలు వున్నారని, రాజకీయాలలో ప్రాధ్యాత ఇచ్చే పార్టీకే తమ మద్దతు వుంటుందని, కురుబలంతా ఐక్యతతో ముందుకు సాగుదామనిరాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక కోటి సాయిలిపి డిగ్రీ కళాశాలలో జిల్లా కురుబ సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి చైర్మన్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాస్, రాష్ట్ర గొర్రెల సంఘం చైర్మన్ నరసింహ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి విఠల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తుప్పటి ఈశ్వరయ్య, రాష్ట్ర యువజన అధ్యక్షులు వసికేరి రమేష్ తదితరులు ముఖ్య అతిథులుగా హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో 8లక్షల మంది కురుబలు వున్నారని, అన్ని రాజకీయ పార్టీలు రెండు ఎంఎల్ఎ, ఒక ఎంపీ సీటు కురుబలకు కేటాయించాలని అన్నారు. కురుబలు ఏ పార్టీ వైపు వుంటే ఆపార్టీ గెలుపొందడం ఖాయమన్నారు. గత ఎన్నిలలో వైసిపిఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక ఎంపి, రెండు ఎంఎల్ఎ సీట్లు ఇచ్చిందన్నారు. వారు అత్యధిక మెజారిటీతో గెలుపొందారన్నారు. కురుబల ఐక్యతకు ఇది నిదర్శనమన్నారు. కురుబలలో రాజకీయంగా చైతన్యం వచ్చిందన్నారు. దేశంలో 12కోట్ల మంది కురుబలు వున్నారన్నారు. కర్నాటక రాష్ట్రంలో కురుబలకు 23సీట్లు కేటాయించడం కురుబల ఐక్యతకు నిదర్శనమన్నారు. విద్యార్థి దశ నుండి కురుబ యువత రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం పుట్టపర్తి సత్యసాయి జిల్లా యువజన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పామల్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కప్పల సుదర్శన్, ఉపాధ్యక్షులుగా బుల్లే అంజి, చైతన్య, నాగార్జున, కార్యదర్శిగా కురుబ నాగేంద్ర, ప్రచార కార్యదర్శిగా దాసరి లోకేష్, కోశాధికారిగా రాగే శ్రీరాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బ్యాల పెదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గురుమూర్తి, కార్యదర్శిగా మల్లికార్జున ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటమయ్య, జగదీష్,కప్పల అనిల్‌కుమార్, బండి వీరనారప్ప, కుంటాల పుల్లయ్య, కొంకా నాగార్జున. లక్ష్మినారాయణ, కప్పల నారాయణస్వామి, బిల్లే సూరి తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో నాయకులు

లీజు తనిఖీ కేంద్రాల ఏర్పాటు ఆంతర్యం ఏమిటో ..?

ప్రజాశక్తి, కదిరి టౌన్

పకృతిలో ఎన్నో సంపదలు మానవ జీవితానికి ఆలవాలంగా నిలిచాయి. అటవీ సంపద కొండలు, గుట్టలు విశిష్టమైన ఖనిజ సంపదలతో పాటు అంతులేని పకృతి వనరుల ఉన్నాయి. ఇందులో ప్రధానమైనది ఖనిజ, అటవీ సంపద. ఈ రెండు అనుసంధానంతో మానవ జీవితానికి మరిన్ని వనరులు సమకూర్చాయి. అయితే రెండు శాఖలు సమన్వయ లోపంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండటంతో కొందరు స్వార్థపరులు ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ గనులశాఖ ప్రభుత్వానికి ప్రజలకు ఆదాయం వనరుగా సమకూర్చుతున్నాయి. అన్నది జగమెరిగిన సత్యం. ఇటీవల కాలంలో భూగర్భ గనుల శాఖ చేస్తున్న వ్యవహార శైలి వారు చేస్తున్న ఆర్భాటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉమ్మడి అనంత జిల్లాలో అంతులేని ఖనిజ సంపద నిక్షేపణలు ఉన్నట్లు పలు రికార్డులతో పాటు శాటిలైట్ సమాచారం ఉంది. కరువుకు నిలయమైన కదిరి ప్రాంతంలో ఖనిజ సంపదకు కొదవలేదు. ఉమ్మడి అనంతలో ప్రధానంగా కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, పెనుగొండ, నియోజకవర్గంలో గ్రానైట్స్, మినరల్స్, సుద్దరాయి, బంగారు గనులు కూడా పెద్ద ఎత్తున నిక్షిప్తమై ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి వీటిపై పర్యవేక్షణ చేయాల్సిన మైన్స్ అండ్ గనుల శాఖ అధికారులు కేవలం అనంత జిల్లాకే పరిమితమై తమ జేబులు నింపుకుంటున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపనలు వినపడుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు ఉంటూ ఉమ్మడి అనంత జిల్లాలో కేవలం ఎవరైనా ఫిర్యాదు చేస్తే తనిఖీలు చేయడం వంటివి చేస్తున్నారు ఆ శాఖల పరిధిలో స్వతహాగా దాడులు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గనుల శాఖను ప్రైవేటీకరణ చేస్తూ ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పుజెప్పి చేతులు దులుపుకొంది. ఉమ్మడి అనంత జిల్లాలో గనులు పర్యావరణ శాఖను ప్రైవేటుకు అప్పచెప్పుతూ ఉత్తర్వులు జారీ చేయడంలో అంతర్యం ఏమిటని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు . ఇందులో రాష్ట్ర మైన్ అండ్ జువాలజీ శాఖ కమిషనర్ టెండర్ ఆహ్వానించి రూ. 10.80 లక్షలకు మైన్స్ ను అప్పజెప్పింది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన అమీగోర్స్ మినరల్స్ అనే సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. అయితే ఈ సంస్థ చేతికి పగ్గాలు వచ్చినప్పుడు నుంచి భూగర్భ గనుల శాఖ కథ అడ్డం తిరిగినట్టు తెలుస్తుంది. ఇందుకు ప్రధాన కారణం ఆ సంస్థ తరపున భూగర్భ గనుల శాఖకు సంబంధించి ఎవరు తనిఖీలు నిర్వహిస్తారో ప్రభుత్వం నుండి ఎలాంటి నిబంధన విధించారో తెలిపే నాధుడు కరువయ్యారు. కదిరి ప్రాంతంలో ప్రధానంగా ఐదు ఆరు చోట్ల తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ప్రైవేటు వ్యక్తులు హల్‌చల్ చేస్తూ వాహనాల దారుల నుండి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కేంద్రాల మీదుగా వెళ్లే వాహనాలకు తనిఖీ చేసే అధికారం ఎవరికి ఉంటుందో తెలియాల్సి ఉంది. మైన్స్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరును పలువురు తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా మైన్స్ అండ్ జువాలజీ అధికారులు స్పందించి ప్రజలకు వాస్తవాలు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.